# "దేవుడు రక్షిస్తాడు"

రచయిత :
... బుద్ధుల వేంకటరమణారెడ్డి ...

"ఒక్క కానీ బాబూ! ఒక్క కానీ! ఆకలి కడుపు తరుక్కొనిపోతూంది. దేవుడు మిమ్మల్ని రక్షిస్తాడు బాబూ!" అంటూ బాధతో అడుగుతూన్న ముసలివాడి డబ్బాలో కానీ పడి శబ్దం చేసింది. "మా స్వామీ! నిన్ను దేవుడు రక్షిస్తాడు" అని ఎంతో సంతోషపడ్డాడు వృద్ధభిక్షువు.

"దేవుడు రక్షిస్తాడు, దేవుడు దయ తలుస్తాడ"న్న పదాలు ఆ చిన్న పదేండ్ల మధు హృదయంలో ప్రవేశించి చాలా సంతోషింపచేశాయి. హుటాహుటిగా యింటికివెళ్ళి తాతని ప్రశ్నించాడు.

"తాతా! దేవుడున్నాడా? ఆయన మనల్ని రక్షిస్తాడట. నిజమేనా తాతా?"

"దేవుడు లేడంటావేమిరా! కష్టకాలాల్లో అతడు సహాయం చేస్తాడు. మన పూజగదిలో చూడలేదూ! దేవుని ప్రార్థించాలెరా నాయనా! అలా అయితే దేవుడు వరమిస్తాడు" అంటూ తాత మనుమడికి భక్తి నూరిపోయసాగాడు.

మధు ఆలోచనల్లోపడి మునిగి తేలుతున్నాడు. పది నిముషాలు దొర్లిపోయాయి.

"తాతా" అన్నాడు ఆలోచనతో. చదువుతూన్న భగవద్గీత మూసి మనుమనికేసి చూశాడు ప్రశ్నార్థకంగా.

"తాతా! దేవుడెలా రక్షిస్తాడు తాతా! బీదవానికి డబ్బిస్తేగా!" అన్నాడు అమాయకంగా.

"ఆఁ అలాగె" అని క్లుప్తంగా జవాబిచ్చి తిరిగి తన చదువులో మునిగిపోయాడు.

మధుకి సంతోషమయింది. తనని దేవుడు కష్టాలలో రక్షిస్తాడనుకొన్నాడు. తనకి అమ్మయిచ్చిన కానీ పప్పులు కొనుక్కొనేందుకు బదులు వృద్ధభిక్షువుకు దానంచేశాడు. ఇదంతా ఆలోచించేసరికి అతని హృదయం చెప్పలేనంత ఉత్సాహంతో ఉబికిపోయింది.

ఇదే ఆలోచనల్తో బడికిపోవడమే మానేశాడు మధు తన్మయత్వంతో తన గదియందే కూర్చున్నాడు. ఘంటలు గడిచాయి. ప్రతిదినం వినబడేబడిగంటలు ఆదినం అతన్ని బడికి వచ్చేందుకు ఏలాటి సహాయం చేయలేకపోయాయి.

"అబ్బాయి ఎక్కడున్నాడు" అన్న తండ్రి గంభీరపు పిలుపుతో మధు తిరిగి ఈలోకంలో పడ్డాడు. అతని కర్ణపుటాల్లో అది మారుమ్రోగింది. గంటచూస్తే నాలుగుదాటింది. అప్పటికి తెలిసింది తను బడికిపోలేదని. హడలిపోయాడు. తను బడికిపోలేదని నాన్నకు తెలిస్తే.....ముచ్చెమటలు పోశాయి. పూర్వపు స్మృతులు జ్ఞాపకానికొచ్చాయి. ఓదినం తాను ఓ పీరియడు బడిలోంచి తప్పించుకొని వచ్చినందుకు హెడ్మాష్టరునుండి రిపోర్టు వచ్చినరోజు అతని హృదయవీధిలో మెరసింది. అసలు ఆ దినమైనా తనొక్కడే రాలేదు. పక్కింటిసోము మాట్నీసినిమాకు బలవంతంచేస్తే పోవాల్సి వచ్చింది. ఇంటికొచ్చేసరికి నాన్న చితకొట్టాడు. అమ్మ కన్నీరు కారుస్తూ నిలబడింది. కానీ అమ్మమాత్రం ఏం చేస్తుంది. ఏమన్నా అంటే నాన్న ఉగ్రుడైపోతాడు. ఇలాటి ఆలోచనలు వచ్చేసరికి మధుకు ముచ్చెమటలు పోశాయి. "రేపు నాన్ననుండి దెబ్బలుతప్పడ మేలాగు? బడికి ఎందుకుపోలేదని అడిగితే ఏం చెప్పను?" ఇత్యాదుల్తో చింతలో మునిగిపోయాడు మధు.

మెరుపువలె ఓ ఆలోచన మెరసింది. "దేవుడు రక్షిస్తాడుగా" అనుకొన్నాడు. తాను బిచ్చగానికి కానీ వేయలా? దేవుడికి ఆమాత్రం కనికరంలేదూ? మరోసారి దేవుడిని

యువదంపతులకు వెలువడినది 50 గ్రంథముల
శృంగార మార్గము త్వరపడుడు సారాంశము

సతీపతికుతూహల రహస్యములు.

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి రసాస్వాదనము చేయుటయే గాక కామశాస్త్రమును తప్పక పఠించేవారు. రాణివాస మందలి కాంతలుకూడా దీనిని నేర్చెడివారని వాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడీ కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారి యపరాధము కాదు. తగిన గ్రంథము లేక పోవుటే దీనికి ప్రధానకారణము. నేడీ కొరతతీరినది. సతీపతి కుతూహల రహస్యములను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామ కళా గ్రంథములతో నిండి కళాసంబంధమగు పూర్ణ జ్ఞానమును కలిగించుచున్నది. ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది.

గ్రంథము వెల రూ. 2-8-0. పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,
సౌకారుపేట, మద్రాసు.

ప్రార్థించాడు. "స్వామీ రేపు హెడ్మాస్టరికి జ్వరం రావాలి. స్కూలుకు రాకూడదు. వచ్చినా రిపోర్టుమాత్రం పంపకూడదు" అని. తనకి రేపు దెబ్బలు తప్పిస్తే ఆ దినం అమ్మ ఇచ్చే అర్ధణా డబ్బులుకూడా బిచ్చగానికి వేసితీరాలని నిశ్చయించుకొన్నాడు. తనప్రార్థన్ని దేవుడు మన్నిస్తాడని దృఢమేర్పడింది. సంతోషంతో ఉబికిపోయాడు.

ఆనాడు గడిచిపోయింది. ప్రొద్దున్నే మామూలుగా బడికిపోయేముందు అమ్మ అర్ధణా డబ్బులిచ్చింది. ప్రార్థనప్రకారంగా వృద్ధభిక్షువుకు దానంచేశాడు. తన ప్రార్థనప్రకారంగా ఈదినం హెడ్మాస్టరుకు జ్వరమొచ్చి స్కూలుకు రాడనుకొన్నాడు. తనకోసము హెడ్మాస్టరుకు జ్వరం వచ్చి బాధపడతాడని మరోవైపు అతని మనసు మనసులో లేకపోయింది. అయినా సంతోషంగా బడికి పోయాడు.

తిన్నగా ఆఫీసురూములోకి తొంగిచూసేసరికి గుండె ఆగిపోయినట్టయింది మధూకు. హెడ్మాస్టరు మామూలు ప్రకారంగా కుర్చీలో కూర్చొని ఏదో వ్రాసుకొంటున్నాడు. మధుకు దుఃఖం, కోపం ఒక్కసారే పొంగుకొచ్చాయి. కంటిలో నీరు కారిపోయాయి. దేవుడిని చెడదిట్టాలనుకొన్నాడు. విచారహృదయంతో క్లాసురూములోకి పోయాడు.

ఇంకా ఓమూల కొంతధైర్యముంది. "హెడ్మాస్టరు రిపోర్టుపంపక పోవచ్చుగా" అని.

మూడో పీరియడు ఐపోయింది. హెడ్మాస్టరు రమ్మంటున్నాడని నౌకరు వచ్చాడు. అవున్న కాస్తధైర్యం దిగజారిపోయింది. ఆఫీసురూములోకి అడుగుపెట్టేసరికి చేతిలో రిపోర్టు పట్టుకొని "ఇదో ఇది మీనాన్నకిచ్చి చేవ్రాలు చేయించుకురా. రానురాను సోమరిపోతు వౌతున్నావు వెధవా" అని పొమ్మన్నాడు.

మధు గుండె లవిసిపోయాయి. గట్టిగా ఏడుస్తామనుకొన్నాడు. కాని ఆ ధైర్యంకూడా లేకపోయింది. బిక్కమొఖంతో క్లాసులోకి వచ్చి కూర్చున్నాడు.

బడి ఎపుడువిడిచారో, తాను ఎలా ఇంటికి చేరాడో తనకే తెలియకుండా పోయింది మధుకు. ఒక్కటిమాత్రం మనసుకొచ్చింది. దారిలో బిచ్చగాడు అరుస్తున్నాడు. దేవుడు దయతలుస్తాడు. దేవుడు రక్షిస్తాడని. బిచ్చగానిమీద వుమ్మేయాలన్న బుద్ధికూడా పుట్టలేకపోలేదు మధుకు. కానీ ఆ పనిమాత్రం చేయలేకపోయాడు. తాత శుష్కవేదాంతాన్ని చెడదిట్టాడు. తానింకెన్నడూ పూజగదిలోకి పోగూడదనుకొన్నాడు.

భోజనం చేశాడు. ఆఫీసునుండి నాన్న ఇంకా భోజనానికి రాలేదనుకొన్నాడు. ఐనా అమ్మని అడిగాడు.

"అమ్మా! నాన్న ఏడీ ?"

"గదిలో" అని ఆమె అటువైపు చూపింది. "నాన్న ఆఫీసుకు పోలేదామ్మా" అని అడుగుదామనుకొన్నాడు. కాని ఆమాట కంఠంవిడిచి బయటికి రానంటూంది. తప్పటడుగులు వేస్తూ గదిలోకి పోయాడు. భయంతో వడికిపోయాడు. నాన్న ఈజీచేరులో కూర్చొని ఏదో చదువుతున్నట్టున్నాడు. కదలకుండా ఉన్నాడు. ఎందుకు పోలేదు ఆఫీసుకు అనుకొన్నాడు.

తిన్నగా "నాన్నా" అని పిలిచాడు.

"ఏమినాన్నా" అని కనువిప్పి వెనక్కి తిరిగిచూశాడు నాన్న.

"దీనిలో చేవ్రాలు చేయినాన్నా" అన్నాడేకాని ఆ కాగితం మాత్రం చేతిలోనే ఉండిపోయింది.

"నాకు తలనొప్పిగా వుందిరా! చూడలేనూ. నేడు పడుకొన్నాను. పోయి మీ అమ్మవద్ద చేయించుకో, ఈ అణా తీసుకో" అని అణాబిళ్ల చేతిలోవేశాడు.



మధుకు ఆశ్చర్యమేసింది. భయం గాలికెగిరిపోయింది. మనసులో దేవుడికి దండం పెట్టాడు. నిట్టూర్పు విడిచాడు. సంతోషంతో బయటకొచ్చాడు. ఇక తను బ్రతికినట్టే. "ఎప్పుడూలేని నాన్న ఈ దినం తన మీద ఎందుకిలా దయచూపించాడు" అని ఆలోచించసాగాడు.

దూరంగా వీధిలోనే కాబోలు వృద్ధభిక్షువు తొందర పలుకులు వినబడుతున్నాయి. "దేవుడు దయతలుస్తాడు, దేవుడు రక్షిస్తాడు" అని. ఒక్కపరుగులో మధు వీధిలోకి పోయాడు. మరునిముషంలో టంగుమని ఆ అణాముక్క భిక్షువు డబ్బాలో "టంగు" మని శబ్దంచేసింది.

మరికొంతసేపటికి పూజగదిలో ఎవరూ చూడకుండా దేవుడికి సాష్టాంగనమస్కార మొనరించాడు మధు.